

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జండగే

## సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి అర్బన్, డిసెంబర్ 21 : సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జండగే సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, హెల్త్ సూపర్ వైజర్లు, ఆరోగ్య సిబ్బందికి కీటకజనిత వ్యాధుల నివారణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మలేరియా కేసులు గుర్తించినప్పుడు ఫీవర్ సర్వే నిర్వహించాలని, రక్త నమూనాలు సేకరించాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇండోర్, అవుట్‌డోర్ స్ప్రే కార్యక్రమాలను చేపట్టాలని, చెరువులు, కుంటల్లో దోమల లార్వాలు తినే చేపలను వదలాలన్నారు. కార్యక్రమంలో వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, నాగయ్య, జిల్లా వైద్యాధికారి డాక్టర్ పరిపూర్ణాచారి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వినోద్, డాక్టర్ యశోద, డాక్టర్ పాపారావు, డాక్టర్ సుమన్, వైద్య అధికారులు పాల్గొన్నారు.

### పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలి

పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెరిగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జండగే సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కేంద్రీయ విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అదనపు తరగతులు నిర్వహించాలని, చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణ పనులను వచ్చే జనవరిలోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ చంద్రమౌళి, నేషనల్ ప్రాజెక్ట్ కన్స్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధి భరత్, పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గిరిధర్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.

### పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ

ఓటర్ల నుంచి వచ్చిన ఫారం 6,7,8 దరఖాస్తులను పరిష్కరించి ఓటరు జాబితా సవరణను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జండగే తాసీల్దార్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16 వరకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని, జాబితాలో ఉన్న తప్పులను సవరించాలన్నారు.

# భువనగిరిలో వైభవంగా పంబాఆరట్టు

- భువనగిరి పెద్ద చెరువులో అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు



అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహ ఊరూగింపులో పాల్గొన్న మహిళా కోలాట బృందం

భువనగిరి అర్బన్, డిసెంబర్ 21: భువనగిరి పట్టణంలోని శబరినగర్‌లో గల హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం పల్లివేట, పంబా ఆరట్టును ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని హన్మాన్‌వాడలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి పెద్ద చెరువు వరకు ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ బెలిదె వెంకన్న ఆధ్వర్యంలో అయ్యప్ప విగ్రహాన్ని గుర్రపు బగ్గీపై ఉంచి కేరళ డప్పు వాయిద్యాలు, ప్రత్యేక కోలాట బృందాల నృత్యాల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పెద్ద చెరువులో వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలాధారులు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నూనె వెంకటేశ్వర్లు, కార్యదర్శి దిడ్డి సత్యం, ట్రెజరర్ శ్యాంఘటాని, ఉపాధ్యక్షుడు గాదె శ్రీనివాస్, మాజీ చైర్మన్లు అయిత రాములు, మంచాల ప్రభాకర్, సభ్యులు ఉప్పల రమేశ్, చామ రవీందర్, మంచుకొండ వినోద్, చీకటిమల్ల రాములు, సిద్దగోని సుధాకర్‌గౌడ్, ఆలె నరేశ్, రావుల శ్రీధర్, పూజారి నరేందర్‌శర్మ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని, నగలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

## బీఆర్ఎస్ కమిటీల సమావేశాలు నిర్వహించాలి

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 21 : బీఆర్ఎస్ పార్టీ పట్టణ, వార్డు కమిటీ సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కృష్ణయ్య, పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### రైస్‌మిల్లర్స్ జిల్లా కార్యదర్శికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పసుపునూరి నాగభూషణం మాతృమూర్తి సత్యలక్ష్మి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి గురువారం నాగభూషణం ఇంటికి వెళ్లి పరామర్శించారు. సత్యలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ. కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు హాలియాలో క్రిస్మస్ గిఫ్ట్‌ప్యాక్‌ల పంపిణీ

హాలియా, డిసెంబర్ 21 : క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రభుత్వం క్రైస్తవులకు అందించిన గిఫ్ట్‌ప్యాక్‌లను శుక్రవారం హాలియాలోని లక్ష్మీనర్సింహగార్డెన్ ఫంక్షన్‌హాల్లో పంపిణీ చేయనున్నట్లు తాసీల్దార్ జయకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. క్రైస్తవులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ప్రమాదవశాత్తు లారీ క్యాబిన్ దగ్ధం

భువనగిరి అర్బన్, డిసెంబర్ 21: భువనగిరి-వరంగల్ ప్రధాన రహదారిపై వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు దగ్ధమైన ఘటన గురువారం చోటు చేసుకుంది. భువనగిరి ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ పరిధిలో గల కర్మన్‌ఘాట్‌కు చెందిన బీమర్ల సుభాశ్‌రెడ్డికి చెందిన ఇసుక లారీ గురువారం వరంగల్‌కు బయల్దేరింది. భువనగిరి పరిధిలోని స్పిన్నింగ్‌మిల్ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు ఇంజిన్‌లో సాంకేతిక లోపంతో పొగలు వచ్చాయి. గమనించిన డ్రైవర్ వెంటనే లారీని రోడ్డు పక్కకు ఆపేశాడు. కొద్దిసేపటికే ఇంజిన్‌లోంచి మంటలు లేచాయి. అవి డీజిల్‌ట్యాంక్‌కు అంటుకోవడంతో పెద్దగా చెలరేగాయి. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా అక్కడికి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే లారీ ముందు భాగం, టైర్లు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు రూ.8లక్షల నష్టం వాటిల్లినట్లు లారీ ఓనర్ సుభాశ్‌రెడ్డి తెలిపాడు.

## దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి అన్నపూర్ణ



విజేతకు బహుమతి అందిస్తున్న జడ్పీటీసీ బీరు మల్లయ్య

భువనగిరి అర్బన్, డిసెంబర్ 21: దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జి.అన్నపూర్ణ అన్నారు. గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయగిరిలోని లింగబసవ ఫంక్షన్‌హాల్లో దివ్యాంగులు, వయో వృద్ధులకు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలను జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ బిక్కునాయక్, ఎంపీపీలు నరాల నిర్మల, భూక్యా సుశీల, నూతి రమేశ్, జడ్పీటీసీలు బీరు మల్లయ్య, తోటకురి అనూరాధ, దివ్యాంగుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

## గ్రామాల్లో పన్నుల వసూళ్లపై దృష్టిసారించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 21: గ్రామపంచాయతీల్లో జనవరి నెలాఖరు వరకు 85 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి సూచించారు. గురువారం తన చాంబర్‌లో జిల్లా పంచాయతీ అధికారి సునంద, డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీల్లో ఆడిట్ అభ్యంతరాలపై సమాధానాలు రాయాలని, పంచాయతీ సిబ్బంది వేతనాలు పెండింగ్ ఉంచొద్దని, పంచాయతీల కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

## యాసంగి సాగుకు సాగర్ నీటిని విడుదల చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

దామరచర్ల, డిసెంబర్ 21 : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులో యాసంగి సాగుకోసం సాగర్ నీటిని విడుదల చేయాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయకట్టు రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కర్నాటక ప్రభుత్వంతో మాట్లాడి సాగర్‌కు నీటిని విడుదల చేయించాలనీ ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఇండియా కూటమి పిలుపు మేరకు జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్, జిల్లా కమిటీ సభ్యుడు రవినాయక్, మండల కార్యదర్శి వినోద్‌నాయక్, నాయకులు సైదులు, పాపానాయక్, ఎర్రానాయక్, కోటిరెడ్డి, దయానంద్ పాల్గొన్నారు.



దామరచర్లలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి